సాక్షి సూర్యాపేట

బుధవారం। 25। జనవరి। 2023



ముస్తాబవుతున్న పెద్దగట్టు

లింగమంతుల జాతరకు పెద్దగట్టు ముస్తాబవుతోంది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఈ జాతర నిర్వహిస్తారు. - 10లో



డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

హైవే వెంట ఆగి ఉన్న లారీలను లక్ష్యంగా చేసుకొని డీజిల్ దొంగతనం చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం 31.°/16°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వీరబోయిన లింగయ్య యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ మంగళవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు అశోక్, నాగేంద్రనాయక్, వేముల రాము, జనార్దన్, వెంకటేష్‌నాయక్, కరుణాకర్, వికాస్‌రాజ్, సాయి, మహేష్ పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



హుజూర్‌నగర్ : సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్

హుజూర్‌నగర్: బాలికలు ఉన్నత చదువులు చదివి అన్ని రంగాల్లో రాణించాలని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాం కుమార్ సూచించారు. పట్టణంలోని బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. బాలికలకు అన్ని వేళలా చట్టం అండగా ఉంటుందన్నారు. బాలికలను ఏ విధంగా వేధింపులకు గురిచేసినా పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు. బాలికలు, మహిళల శ్రేయస్సు కోసం వరకట్న నిరోధక చట్టం, పోక్సో చట్టం, బాలికా సంరక్షణ చట్టం తదితర చట్టాలు ఉన్నాయని ఆయన తెలిపారు. 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహం చేయడం చట్ట విరుద్ధమని అటువంటి చర్యలకు పాల్పడితే తల్లిదండ్రులను కూడా కఠినంగా శిక్షిస్తామన్నారు. స్వతహాగా న్యాయవాదిని నియమించు కునే స్థోమత లేని వారికి మండల న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధికార ప్రతినిధి కాల్వ శ్రీనివాస రావు, ఏజీపీ ఉప్పల గోపాలకృష్ణమూర్తి, న్యాయవాదులు ఎంఎస్ రాఘవరావు, చక్రాల వెంకటేశ్వర్లు, సీఐ రామలింగారెడ్డి, ఎస్‌ఐ వెంకటరెడ్డి, ప్రిన్సిపాల్ అనిత, వైస్ ప్రిన్సిపాల్ మీరాబీ, ఉపాధ్యాయినులు, పోలీస్, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చేలా మేళ్లచెరువు జాతర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

మేళ్లచెరువు : రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చేలా మేళ్ల చెరువు జాతర నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తెలిపారు. మేళ్లచెరువు మండలకేంద్రంలోని శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఫిబ్రవరి 18 నుంచి 22 వ తేదీ వరకు నిర్వహించే మహాశివ రాత్రి జాతరపై అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.జాతర కోసం ప్రభుత్వం నుంచి రూ.50 లక్షలు విడుదల చేయించినట్లు పేర్కొన్నారు. ఈ సారి జాతరను వారం రోజుల పాటు గతంలో కంటె మెరుగ్గా నిర్వహించేలా చూడాలని, భక్తులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో నిర్వహించే ఎద్దుల పందేలు, కబడ్డీ, సాంస్కృతిక కార్యక్రమాల మైదానాలను పరిశీలించారు. సమావేశంలో దేవాదాయ శాఖ అస్టింట్ కమిషనర్ మహేందర్‌కుమార్, సీఐ దుర్గాప్రసాద్, ఎన్పెస్పీ డీఈ స్వామి, డాక్టర్ ప్రేమ్‌సింగ్, విద్యుత్ డీఈ వెంకటకృష్ణ, తహసీల్దార్ దామోదర్‌రావు , ఎంపీడీఓ ఇసాక్‌హుస్సేన్, ఎస్‌ఐ సురేష్ యాదవ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటరెడ్డి, ఆర్‌ఆండ్‌బీ డీఈ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ పందిళ్లపల్లి శంకర్‌రెడ్డి , ఆలయ మేనేజర్ కొండారెడ్డి, మైహోం, కీర్తి, రెయిన్ సిమెంట్ పరిశ్రమల అధికారులు పాల్గొన్నారు.

● బాలికా దినోత్సవం



జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా నూతనకల్ మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు తదితరులు

వేరుశనగకు రికార్డు ధర

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 349 బస్తాల వేరుశనగ కాయ వచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. మార్కెట్లో వేరుశనగ క్వింటాకు గరిష్ఠంగా రూ.7809 ధర పలికినట్లు తెలిపారు. వేరుశనగకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.5850. కానీ మద్దతు ధర కంటే అధిక ధర రావడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మైనార్టీ రుణం.. పోటీ తీవ్రం

- 69 యూనిట్లకు 3,216 దరఖాస్తులు
- అరకొర కేటాయింపులతో మైనార్టీల్లో అసంతృప్తి
- యూనిట్లు పెంచాలంటూ వేడుకోలు
- ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

నాగారం : అల్పసంఖ్యాక వర్గాల (మైనార్టీ) నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలకు జిల్లాలో తీవ్ర పోటీ నెలకొంది. మంజూరైన యూనిట్లు వంద లోపు ఉండగా దరఖాస్తులు వేల సంఖ్యలో వచ్చాయి. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీ నిరుద్యోగులకు ఉపాధి కల్పించడానికి సబ్సిడీ రుణాలు మంజూరు చేసింది. జిల్లాకు రెండు కేటగిరీల కింద 69 యూనిట్లు మంజూరు చేసింది.

యూనిట్ల కేటాయింపు..

మైనార్టీ రుణాలు జిల్లాకు రెండు కేటగిరిల్లో మొత్తం 69 యూనిట్లు మంజూరు కాగా వీటిలో కేటగిరి–1(రూ.1లక్ష యూనిట్‌లు) 48 యూనిట్లు, కేటగిరి –2 (రూ.2లక్షల యూనిట్‌లు)21 గా ఉన్నాయి. ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన 69 యూనిట్లకు గాను రూ.67.80 లక్షల రాయితీ నిధులు కేటాయించారు. కేటగిరీ–1లో 59 రకాల యూనిట్లకు రూ.లక్ష వరకు రుణం మంజూరు చేస్తారు. దీనిలో 80శాతం రాయితీ కల్పిస్తారు. కేటగిరి–2లో 25 రకాల యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు రూ.2లక్షల చొప్పున రుణం మంజూరు చేస్తారు. దీనిలో 70శాతం సబ్సిడీ వర్తిస్తుంది. ఇదిలా ఉంటే జిల్లాకు 69 యూనిట్లు కేటాయిస్తే...3216 దరఖాస్తులు వచ్చాయి. తీవ్ర పోటీ నెలకొనడంతో తమకు ఎలా న్యాయం జరుగుతుందని దరఖాస్తు దారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లాలో 475 గ్రామ పంచాయతీలను పరిగణనలోకి తీసుకుంటే ఆరు గ్రామాలకు ఒక లబ్ధిదారుడికి కూడా ప్రయోజనం దక్కేలా లేదు. కాగా ముస్లిం జనాభా ప్రాతిపదికన యూనిట్లు కేటాయించినట్లు సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

యూనిట్ల సంఖ్యను పెంచాలి



మైనార్టీ రుణాల యూనిట్లను పెంచి, నిరుద్యోగులకు చేయూత నివ్వాలి. ప్రభుత్వం ఐదేళ్లగా మైనార్టీ రుణాలు మంజూరు చేయకుండా ఇప్పుడు తక్కువ యూనిట్లు కేటాయించడంతో ప్రయోజనం లేకుండా పోయింది. మరికొన్ని యూనిట్లు మంజూరు చేస్తే నిరుద్యోగులకు మేలుకలుగుతుంది.

– ఎం.డీ.సయ్యద్, తుంగతుర్తి.

జనాభా ప్రాతిపదికన యూనిట్ల కేటాయింపు

మైనార్టీల కోసం రాయితీ రుణాల దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. సబ్సిడీ రుణాలకు సంబంధించి జనాభా ప్రాతిపదికన యూనిట్లను కేటాయించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించాం.

– విజయేందర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి

దరఖాస్తులు ఇలా..

మైనార్టీ నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం అర్హులైన ముస్లింలు, సిక్కులు, పార్సీలు, బౌద్ధులు, జైనుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగులు ఆయా మండల పరిషత్ కార్యాలయాలు, పట్టణ ప్రాంతాల్లోని వారు మున్సిపాలిటీ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకున్నారు. మొత్తం 3,216 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన యూనిట్లకు వచ్చిన దరఖాస్తులతో పోల్చితే ఒక్కో యూనిట్‌కు 47మంది పోటీపడుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రభుత్వం యూనిట్లు మంజూరు చేసిందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఏటా ఇవ్వాల్సిన రాయితీ రుణాలు గత అయిదేళ్లుగా ఇవ్వలేదు. 2020–21లో డ్రైవర్ ఎంపవర్ మెంట్ పథకం కింద రుణాలు మంజూరు ప్రకటనలకే పరిమితమైంది. అయిదేళ్ల తర్వాత కూడా అరకొరగా యూనిట్లు కేటాయించడంపై మైనార్టీ నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం యూనిట్ల సంఖ్యను పెంచాలని జిల్లాలోని పలువురు ముస్లిం నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సంపూర్ణ అంధత్వ నివారణే లక్ష్యం

● విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



నాగారంలో కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నాగారం : రాష్ట్రంలో సంపూర్ణ అంధత్వ నివారణే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. అనంతరం కంటి వైద్యపరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. కంటివైద్య శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ప్రజలు తమకు కేటాయించిన తేదీన వచ్చి కంటిపరీక్ష చేయించుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తారని, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. గ్రామంలో కలిగియదిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ హర్షవర్ధన్, తహసీల్దార్ హరిశ్చంద్ర ప్రసాద్, ఎంపీడీఓ జి.శోభారాణి, ఎంపీపీ కూరం మణివెంకన్న, డాక్టర్ కె.ఉమ, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గుండగాని అంబయ్య, ఉపసర్పంచ్ కె.భద్రయ్య, చిప్పలపల్లి సోమయ్య, దోమల బాలమల్లు, అరుణ్, ఉపేందర్, లింగమల్లు, సైదులు, దేవరకొండ మురళి పాల్గొన్నారు.

యాదాద్రి నృసింహుడి ఆలయంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకుపూజ నిర్వహించారు. ఆంజనేయస్వామిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. ప్రధానాలయంలో, విష్ణు పుష్కరిణి, అనుబంధ ఆలయాలైన శివాలయం, పూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల వద్ద ఉన్న ఆంజనేయస్వామిని భక్తులు మొక్కుకొని పూజలు చేశారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవ, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు విశేషంగా నిర్వహించారు.

ఓటే వజ్రాయుధం

- ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ఓటు హక్కు
- జిల్లా ఓటర్లు 9,14,191 మంది
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం



దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది ఓటు హక్కు. ఏ దేశం .. ఏ రాష్ట్రంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా కుల మతాలకు, రాగద్వేషాలకు అతీతంగా వినియోగిస్తారో ఆ దేశంలో ప్రజాస్వామ్యం పదికాలల పాటు వర్ధిల్లుతుందని రాజకీయ పండితులు చెబుతుంటారు. నేటి యువత రాజకీయ కార్యకలాపాల్లో నిమగ్నం అయ్యేలా చూడడమే ఓటరు దినోత్సవ లక్ష్యం. ఆర్టికల్ 324 ద్వారా ఏర్పడిన ఎన్నికల కమిషన్ ఏటా జనవరి 25న ఓటరు దినోత్సవం జరపాలని నిర్ణయించింది. 2011లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్‌యువతలో ఓటరు నమోదు ప్రాధాన్యత పెంచడానికి ఎన్నికల కమిషన్ ఆవిర్భావ తేదీ అయిన జనవరి 25నే ఓటరు దినోత్సవంగా ప్రకటించారు. ప్రతి సంవత్సరం ఒక్కో అంశంపై ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తుండా ఈ సారి 'నథింగ్ లైక్ ఓటింగ్ .. ఐ ఓట్ ఫర్ షూర్'అనే అంశంపై జరపనున్నారు.

నేడు అవగాహన కార్యక్రమాలు

ఓటరు దినోత్సవం ప్రధాన లక్ష్యం 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను నూతన ఓటరుగా నమోదు చేయాలని వారిని ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేయాలనే సంకల్పం. నేటి ఆధునిక కాలంలో ఓటు హక్కు సులువుగా పొందేలా ఆన్‌లైన్ ద్వారా ఓటు నమోదును ఎన్నికల కమిషన్ చేపట్టింది. నేడు ఓటు ప్రాధాన్యతపై జిల్లాలోని అన్ని పంచాయతీల్లో బీఎల్‌ఓలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలో ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఇతర అధికారులు పాల్గొననున్నారు. అదే విధంగా ఈ నెల 5న ప్రచురించిన ఓటరు జాబితా ప్రతులను గ్రామ పంచాయతీల వారీగా మండల అధికారుల ద్వారా పంపిణీ చేయనున్నారు.

నియోజకవర్గాల వారీగా ఓటర్లు..

జిల్లాలోని నాలుగు నియోజక వర్గాల పరిధిలో 9,14,191 మంది ఓటర్లు ఉన్నారు. సూర్యాపేట నియోజకవర్గం పరిధిలో 2,22,769 మంది ఓటర్లు ఉండగా 1,09,716 మంది పురుష ఓటర్లు 1,13,049 మంది స్త్రీ ఓటర్లు ఉండగా నలుగురు ఇతర ఓటర్లు ఉన్నారు. అదే విధంగా కోదాడ నియోజకవర్గంలో 2,25,714 మంది ఓటర్లు ఉండగా 1,10,998 మంది పురుషులు, 1,14,706 మంది స్త్రీలు, 10 మంది ఇతరులు ఉన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో 2,35,349 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,18,600 మంది పురుష ఓటర్లు, 1,16,744 మంది స్త్రీలు, ఐదుగురు ఇతరులు ఉన్నారు. ఇక హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,30,359 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,13,056 మంది పురుష ఓటర్లు, 1,17,299 మంది స్త్రీలు, నలుగురు ఇతర ఓటర్లు ఉన్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో ఓటరుతో ఆధార్ అనుసంధానం ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటి వరకు 49శాతం మంది ఓటర్లు ఆధార్ అనుసంధానం చేయించుకున్నారు.

విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

● కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్



మిర్యాలలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్

నూతనకల్: కంటి వెలుగు కేంద్రాల్లో వైద్య సిబ్బంది ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు విధులు నిర్వహించాలని, విధుల నిర్వహణలో అలసత్వం వహించే వారిపై చర్యలు తప్పవని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని మిర్యాలలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును సద్వినియోగం చేసుకొని అంధత్వ నివారణకు కృషి చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ స్క్రీనింగ్ ద్వారా పరీక్షలు నిర్వహించి లోపాలను గుర్తించి అవసరమైన చికిత్సలు ఉచితంగా ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనకటి సునిత, ఎంపీటీసీ జక్కి పరమేష్, తహసీల్దార్ ఎం.డీ. జమీరుద్దీన్, ఎంపీడీఓ ఇందిరా, పీఏసీఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, మండల వైద్యాధికారి అస్రితరెడ్డి పాల్గొన్నారు.

ఉన్నతంగా తీర్చిదిద్దాలి

చివ్వెంల(సూర్యాపేట): తల్లిదండ్రులు కుమారులతో సమానంగా బాలికలను ఉన్నతంగా తీర్చి దిద్దాలని జిల్లా సంక్షేమ అధికారిణి జ్యోతిపద్మ కోరారు. మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొని మాట్లాడారు. బాలికలు పుట్టినప్పటి నుంచే ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 14 సంవత్సరాలలోపు అమ్మాయిలకు వివాహం చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. బాల్యవివాహాల గురించి ఇబ్బందులు ఉంటే 1098కు సమాచారం అందించాలన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక, వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనబర్చిన బాలికలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి బి. రవికుమార్, జిల్లా వైద్యాధికారి బి. కోటాచలం, బాల రక్షాభవన్ కో ఆర్డినేటర్ వెంకటలక్ష్మి, ఎస్‌వో నాగలక్ష్మి, సీడీపీవోలు, సఖి సెంటర్ అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా సంక్షేమ అధికారి జ్యోతిపద్మ

ప్రజా ప్రయోజనాల కోసమే నిధులు ఖర్చుచేయాలి

పెన్‌పహాడ్: ప్రభుత్వం వివిధ గ్రాంట్‌ల ద్వారా మంజూరైన నిధులను ప్రజా ప్రయోజనాల మేరకే ఖర్చు చేయాలని జెడ్పీ సీఈఓ సురేష్ ఆదేశించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. జెడ్పీ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, ఎస్‌డీఎఫ్, సీడీపీ నిధులకు సంబంధించిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా పనుల్లో పాల్గొంటున్న కూలీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఉపాధి జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేసే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, ఎంపీఓ నరేష్ ఉన్నారు.

ఒకే ఒక్కడు..!

- ఇంగ్లిష్ భాషా నైపుణ్యాల శిక్షణకు జిల్లా నుంచి ఒక్క టీచరే దరఖాస్తు
- బెంగళూరులో శిక్షణ తరగతులు
- బోధనపై పట్టు సాధించేలా మెళకువలు



చిలుకూరు: ప్రభుత్వ బడుల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంగ్లిష్ మీడియంలో బోధన అమలు చేస్తున్నారు. దీంతో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల్లో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ సూచనతో విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ సౌత్ ఇండియా (ఆర్‌ఐఈఎస్‌ఐ) సంస్థ సహకారంతో నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 13 నుంచి ప్రాంతీయ స్థాయిలో 50 మందికి అందించనుండగా జిల్లా నుంచి ఒకరు దరఖాస్తు చేసుకోగా ఆయనను ఎంపిక చేశారు. ఈయనకు బెంగళూరులో శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రత్యేక మెళకువలు..

ఉపాధ్యాయులు ఇంగ్లిష్‌లో పట్టు సాధించేలా మెళకువలు నేర్పించనున్నారు. వ్యాకరణం, పదాలు పలికే విధానం, చదవడం, రాయడం నేర్పిస్తారు. అధ్యాపకులు, భాషా నిపుణులతో ఉమ్మడిగా చర్చలు ఉంటాయి. విశ్వ విద్యాలయాల్లో చదువుతున్న అనుభూతిని కలిగిస్తారు. తరగతి గది బోధన ఎలా చేయాల్లో సులభ పద్ధతిలో ఇంగ్లిష్ ఎలా బోధించాలో నేర్పించనున్నారు. పాఠ్యాంశాలతో పాటు రైమ్స్ రాయిస్తారు. ఇట్ ఫర్ చేంజ్ పేరిట అధునాతన కంప్యూటర్ ప్రయోగశాలలను అందుబాటులో ఉంచనున్నారు.

ముగిసిన దరఖాస్తు ప్రక్రియ

శిక్షణపై ఆసక్తిగల ఉపాధ్యాయుల నుంచి జిల్లా విద్యాశాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. జిల్లా నుంచి హుజూర్‌నగర్ మండలం అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన చేపూరి నరసింహారావు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆయనను డీఈఓ ఎంపిక చేశారు.

ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి..



ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించడానికి శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్నాను. దీంతో జిల్లా విద్యాధికారి నన్ను ఎంపిక చేశారు. 10 ఏళ్ల పాటు ఇంగ్లిష్ సబ్జెక్టు ఆర్‌పీగా పని చేశాను. ఇంగ్లిష్‌పై ఉన్న ఇష్టంతోనే దరఖాస్తు చేసుకున్నాను. ఆ స్థాయిలో విద్యార్థులకు ఇంగ్లిష్ బోధన చేస్తాను.

చేపూరి నరసింహారావు, సూర్యాపేట జిల్లా

ఎంపిక చేశాం



ప్రాథమిక స్థాయిలో ఉపాధ్యాయుల్లో ఇంగ్లిష్ భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు ఆర్‌ఐఈఎస్‌ఐ ఆధ్వర్యంలో బెంగళూరులో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందు కోసం జిల్లా నుంచి ఒక్కరే దరఖాస్తు చేసుకోగా ఎంపిక చేశాం. నెలరోజుల పాటు శిక్షణ ఉంటుంది.

– అశోక్, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట జిల్లా

ఇంకా.. 28.87 శాతమే!

- పల్లెల్లో వసూలైన ఆస్తిపన్ను రూ.3.13కోట్లు
- లక్ష్యం రూ.10.84కోట్లు
- ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో రెండు నెలలే గడువు



దురాజ్‌పల్లి (సూర్యాపేట): గ్రామ పంచాయతీల్లో పన్నుల వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో ఖజానా ఖాళీ అయి కార్మికులకు వేతనాలు, కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేని స్థితి వందలాది గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను గ్రామ పంచాయతీల్లో ఆస్తిపన్ను వసూళ్లకు మరో రెండు నెలల సమయమే మిగిలి ఉంది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా కేవలం 28.87 శాతం పన్నులే వసూలయ్యాయి. మిగిలిన రెండు నెలల్లో 71.13 శాతం పన్ను వసూలు చేసేందుకు అధికారులకు సవాలుగా మారింది.

2022-23 పన్నుల వసూళ్ల వివరాలు

ఈ ఏడాదిలో వసూలు చేయాల్సింది	రూ.10,39,92,207
గత సంవత్సరం బకాయిలు	రూ.45,01,666
మొత్తం వసూళ్ల లక్ష్యం	రూ.10,84,93,873
నేటివరకు వసూలు చేసింది	రూ.3,13,16,847
పెండింగ్	రూ.7,35,43,370

గతేడాది బకాయిలతో కలిసి..

జిల్లాలో 475 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.10.39 కోట్ల పన్నులు వసూలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే గత సంవత్సర బకాయిల కలిపి మొత్తం రూ.10.84 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు రూ.3.13 కోట్లు వసూలు చేసినట్లు అధికారులు లెక్కలు చూపుతున్నారు. నేటి వరకు కేవలం 28.87శాతం పన్నులు మాత్రమే వసూలు చేయగా రానున్న రెండు నెలల్లో 71.13 శాతం పన్నులు వసూలు చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

లక్ష్యం పూర్తి చేస్తాం

గ్రామ పంచాయతీల్లో ప్రతి సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలల్లోనే అధికంగా పన్నులు వసూలవుతాయి. ఈ ఆర్థిక సంవత్సరం బకాయిలను వసూలు చేసి లక్ష్యం పూర్తి చేసేందుకు పంచాయతీ అధికారులను సిద్ధం చేస్తాం. మొత్తానికి గడువులోగా లక్ష్యం పూర్తి చేస్తాం.

– యాదయ్య, డీపీఓ

క్లుప్తంగా

మృతుడు హాలియా వాసిగా గుర్తింపు


ఏడుకొండలు (ఫైల్)

నార్కట్‌పల్లి: మండలంలోని చెర్వుగట్టు గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో ఈ నెల 22న సగం కాలిన వ్యక్తి మృతదేహం లభ్యమైన విషయంతెలిసిందే. మృతదేహానికి సోమవారం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించగా మృతుడి ఎడమ చేతిపై కావ్య అని, కుడి చేతిపై వృత్తాకారంలో అమ్మ అని, కుడి భుజంపై సూర్యుని ఆకారంలో ఓం అని పచ్చబొట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయాన్ని పలు పత్రికలలో ప్రచురించగా.. హాలియాలోని రెడ్డి కాలనీకి చెందిన కంభంపాటి నరేందర్ చూసి చనిపోయింది తన తమ్ముడు కంభంపాటి ఏడుకొండలు(28) అని గుర్తించి మంగళవారం నార్కట్‌పల్లి పోలీసులను ఆశ్రయించాడు. తన తమ్ముడు కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని, అతడి మృతిపై విచారణ జరిపించాలని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్కట్‌పల్లి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి గుండెపోటుతో వ్యక్తి మృతి

మిర్యాలగూడ టౌన్‌: చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మంగళవారం మిర్యాలగూడ మండలంలోని ఆలగడప వద్ద చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఏఎస్‌ఐ ఉమాపతిరావు తెలిపిన వివరాల ప్రకారం... ఆలగడప గ్రామానికి చెందిన నల్లగొండ గంగయ్య(58) తన కుమారుడు వెంకన్నతో కలిసి చేపలు పట్టేందుకు మంగళవారం తెల్లవారుజామున గ్రామ సమీపంలో గల మూసీ నది వద్దకు వెళ్లగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే అతడి కుమారుడు బైక్‌పై గంగయ్యను గ్రామానికి తీసుకొచ్చి ఆర్‌ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లి చూపించగా అప్పటికే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

చిట్యాల: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. చిట్యాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండలంలోని గోపాలయపల్లి గ్రామానికి చెందిన మునుకుంట్ల సురేష్(26) ఈ నెల 9వ తేదీన చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ధర్మా తెలిపారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

- ఇద్దరు కూలీలకు తీవ్రగాయాలు

నేలకొండపల్లి: కూలీలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి బోల్తాపడడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని జెర్రిపోతులగూడేనికి చెందిన వ్యవసాయ కూలీలు మంగళవారం నాట్లు వేసేందుకు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని అనాసాగారం వచ్చారు. నాట్లు వేశాక తిరిగి వెళ్తుండగా వీరి ఆటో కొత్తకొత్తూరు సమీపాన అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్. నాగమణి, టి. మణెమ్మకు తీవ్రగాయాలు, మిగిలిన వారికి స్వల్ప గాయాలు కావడంతో నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వ్యక్తిపై హత్యాయత్నం

- పోలేనిగూడెం వాసిని కత్తులతో వెంబడించి దాడి చేసిన దుండగులు
- వారి నుంచి తప్పించుకుని పోలీసులకు సమాచారం ఇచ్చిన బాధితుడు
- పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోగా పరారైన నిందితులు
- కోదాడ శివారులోని వెంచర్‌లో ఘటన

చిలుకూరు: మండలంలోని పోలేనిగూడెం వాసి అయిన అధికార పార్టీ చెందిన పనస గోపిపై సోమవారం రాత్రి కోదాడ పరిసరాల్లో గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో హత్యాయత్నం చేశారు. బాధితుడు, అతడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పనస గోపి మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో చురుకుగా ఉంటూ, ఇటీవల వ్యక్తిగత కారణాలతో అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లో చేరాడు. అయితే గోపి సోమవారం రాత్రి 8గంటల సమయంలో బరాఖత్‌గూడెం నుంచి కొమరబండ మీదుగా కోదాడ హైవే పక్కన గల వెంచర్ గుండా బైక్‌పై కోదాడకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో గోపి వెంచర్‌లోకి రాగానే గుర్తుతెలియని వ్యక్తులు అతడిని ఆపి కర్రలతో కొట్టడంతో పాటు కత్తితో పొడిచారు. గోపి వారి నుంచి తప్పించుకుని తన స్నేహితులు, కోదాడ టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుల కోసం చుట్టుపక్కల వెతికగా, అప్పటికే వారు పరారయ్యారు. తీవ్రగాయాల పాలైన గోపిని పోలీసులు వెంటనే కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతున్నాడు. తనపై నలుగురు వ్యక్తులు దాడి చేశారని, వారు ముఖానికి ముసుగులు వేసుకున్నారని గోపి పోలీసులకు తెలిపాడు. అందులో ఒకరు ముసుగు తీయడంతో ఆ వ్యక్తిని తాను చూశానని, వారు ఈ ప్రాంత వ్యక్తులుగా లేరని, 'మీ గ్రామానికి చెందిన కొందరు నిన్ను చంపమని రూ.6లక్షలు ఇచ్చారురా' అని నిందితులు చెప్పినట్లుగా గోపి పోలీసులకు వివరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కోదాడ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

బయటపడ్డ విభేదాలు

గోపిపై కత్తులతో హత్యాయత్నం జరగడంతో పోలేనిగూడెం గ్రామంలో మరోమారు వర్గ విభేదాలు బయటపడ్డాయి. గ్రామంలో మొదటి నుంచి రెండు వర్గాలు ఉండగా, ఇటీవల వారందరూ ఒకే పార్టీలో చేరారు. అయినప్పటికీ గ్రామంలో చిన్న చిన్న ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. గతంలో 2014 ఎంపీపీ, జెడ్పీటీసీ ఎన్నికల సమయంలో గ్రామంలో ఓ వ్యక్తి హత్య జరగగా, ఏడాది క్రితం గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఇప్పుడు గ్రామానికి చెందిన వ్యక్తిపై హత్యాయత్నం జరగడంతో గ్రామంలో భయాందోళనకు గురవుతున్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్త రిమాండ్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందనే భార్యను హింసించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తను పోలీసులు మంగళవారం రిమాండ్‌కు తరలించారు. నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలంలోని జాల్‌తండాకు చెందిన జటావత్ మాలిక్, సాలి(36) భార్యాభర్తలు. మాలిక్ వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం ఇంట్లో తెలియడంతో మాలిక్, సాలి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తుందని మాలిక్ మానసికంగా, శారీరకంగా సాలిని వేధించడం మొదలు పెట్టాడు. దీంతో సాలి ఈ నెల 19న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్‌కు తరలించగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతిచెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం మాలిక్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగరాజు తెలిపారు.

మూడేళ్ల జైలుశిక్ష..

బీబీనగర్: అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధింపులకు గురిచేసి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ భువనగిరి కోర్టు న్యాయమూర్తి దశరథ రామయ్య మంగళవారం తీర్పునిచ్చారు. ఎస్‌ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెంకిర్యాలకు చెందిన ఆగమయ్య తన కుమార్తె లావణ్యను జమీలాపేట గ్రామానికి చెందిన కృష్ణకు ఇచ్చి 13 ఏళ్ల క్రితం వివాహం చేశాడు. అదనపు కట్నం కోసం లావణ్యను కృష్ణ వేధింపులకు గురిచేస్తుండేవాడు. దీంతో విసుగు చెందిన లావణ్య 2014 డిసెంబర్ 8న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ ప్రణీత్‌కుమార్ కృష్ణను అరెస్టు చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. కాగా కృష్ణపై మరో చార్జీషీట్ దాఖలు కాగా, మంగళవారం భువనగిరి కోర్టులో దీనిపై జరిగిన విచారణలో న్యాయమూర్తి సాక్ష్యాధారాలు పరిశీలించి నిందితుడు కృష్ణకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

కలల కొలువు రాకుండానే..

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం, మరో నలుగురికి గాయాలు
- మృతుడు వలిగొండ మండలం పొద్దుటూరు గ్రామ వాసి


వినోద్‌కుమార్ మృతదేహం

ఆమనగల్లు: పోలీసు కొలువు కోసం ఆ యువకుడు కన్న కలలు కల్లలయ్యాయి. ఆర్టీసీ బస్సు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆ కల తీరకుండానే బలితీసుకుంది. మరో నలుగురు యువకులను ఆస్పత్రి పాల్జేసింది. ఈ విషాదకర సంఘటన మంగళవారం రాత్రి రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణ సమీపంలో హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు.. వివిధ ప్రాంతాలకు చెందిన వినోద్‌కుమార్ (25), భరత్‌కుమార్, పవన్‌కల్యాణ్, వీరేశ్, సుధాకర్ హైదరాబాద్‌లోని నల్లకుంటలో ఉంటూ పోలీసు శిక్షణ పొందారు. ప్రిలిమినరీ, ఫిజికల్ ఈవెంట్స్‌లో పాల్గొని మెయిన్ పరీక్షల కోసం ఎదురుచూస్తున్నారు. కారులో శ్రీశైలం వెళ్లి తిరిగి వస్తుండగా ఆమనగల్లులోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్లు సమీపంలో ఎదురుగా వస్తున్న అచ్చంపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యాదాద్రి జిల్లా వలిగొండ మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన భరత్‌కుమార్, పవన్‌కళ్యాణ్, వీరేశ్, సుధాకర్‌ను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వినోద్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సుందరయ్య తెలిపారు.

డీజిల్ దొంగతానికి పాల్పడుతున్న ముఠా అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేంద్రప్రసాద్

సూర్యాపేట క్రైం: జాతీయ రహదారుల వెంట ఆగి ఉన్న లారీలను లక్ష్యంగా చేసుకొని డీజిల్ దొంగతనం చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఈ కేసు వివరాలు వెల్లడించారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం ఎక్స్ రోడ్డులో పోలీసులు వాహనాలు తనిఖీల్లో భాగంగా ఒక లారీని ఆపి చెక్ చేస్తుండగా డ్రైవర్ లెక్కల పూర్ణయ్య పారిపోయేందుకు ప్రయత్నించగా అతడితో పాటు లారీలో ఉన్న బాణావత్ కృష్ణ నాయక్, కునిశెట్టి ముసలయ్యను పట్టుకుని విచారించారు. వీరు గత ఐదు రోజులుగా సూర్యాపేట జాతీయ రహదారి వెంట ఆగి ఉన్న లారీలను లక్ష్యంగా చేసుకొని ఎలక్ట్రానిక్ మోటారు సహాయంతో డీజిల్ దొంగలించి, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో వ్యవసాయదారులకు అమ్ముతున్నట్లు ఒప్పుకున్నారు. వీరి నుంచి లారీతో పాటు 1500 లీటర్ల డీజిల్, వన్‌హెచ్‌పీ మోటరును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. వీరు 2016 నుంచి ఇదే విధంగా నేరాలు చేస్తూ జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడు..

క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సూర్యాపేట ఎస్పీ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన బొంత ఉదయ్ మంగళవారం ఉదయం పట్టణంలోని చంద్రన్న కుంటలోని ఓ ఇంట్లో దొంగతనం చేస్తుండగా ఇంటి యాజమాని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మంగళవారం ఉదయ్‌ను పోలీసులు అతడి ఇంటి వద్ద పట్టుకుని విచారించగా దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. సూర్యాపేట వన్‌టౌన్ పరిధిలో 3, సూర్యాపేట టూటౌన్ పరిధిలో ఒక దొంగతనం చేశాడని, క్రికెట్ బెట్టింగ్‌లు పెట్టి నష్టాలు రావటంతో నిందితుడు దొంగతనాలు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడి నుంచి రూ.3.35 లక్షల నగదు, 5తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని, న్యాయంస్థానంలో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఈ కేసులను ఛేదించిన పట్టణ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు ఎస్‌కే. యాకూబ్, క్రాంతి, హెడ్ కానిస్టేబళ్లు కృష్ణ, కరుణాకర్, కానిస్టేబుళ్లు సైదులు, ఆనంద్, మధులను ఎస్పీ అభినందించారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ నాగభూషణం, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం


కాలువలో కొట్టుకొచ్చిన మహిళ మృతదేహం

మిర్యాలగూడ టౌన్‌: మండల పరిధిలోని యాద్గార్‌పల్లి గ్రామ శివారులో మంగళవారం నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని ముల్కల కాలువలో మహిళ మృతదేహం కొట్టుకొచ్చిందని స్థానికులు మిర్యాలగూడ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే యాద్గార్‌పల్లి గ్రామంలో కొంతకాలంగా 50–55 ఏళ్ల వయస్సు గల మహిళ భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తుందని, ఈ మృతదేహం ఆమెది ఏమోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సద్దల చెరువులో వ్యక్తి మృతదేహం..


సద్దల చెరువులో వ్యక్తి మృతదేహం

సూర్యాపేట క్రైం: సూర్యాపేట పట్టణంలోని సద్దల చెరువులో మంగళవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45 నుంచి 55 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి చెరువులో నీటిపై తేలియాడుతుండడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్థానికుల సహాయంతో బయటకు తీశారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ క్రాంతి కోరారు.

ఆరుగురు దొంగల అరెస్ట్

- రూ.32.83లక్షల సొత్తు రికవరీ


రికవరీ చేసిన సొత్తును పరిశీలిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

మోత్కూరు: ఇళ్లల్లో చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32.83లక్షలు విలువైన సొత్తును రికవరీ చేసుకున్నారు. మంగళవారం రామన్నపేట సీఐ మోతీరామ్, మోత్కూరు ఎస్‌ఐ వి. జానకిరాంరెడ్డి విలేకరులకు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండకు చెందిన బొడిగె అశోక్‌తో పాటు చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామానికి చెందిన గుండెబోయిన చంద్రం, నూకి సతీష్, బైరవోని స్వామి, బేడె బాలకష్ణ, నార్కట్‌పల్లి మండలం సప్పిడిగూడెం గ్రామానికి చెందిన గంధసిరి ఉపేందర్ తాళం వేసిన ఇళ్లు, గ్రామ శివారుల్లో ఉండే ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. వీరిపై పలు పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. దీంతో రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ పర్యవేక్షణలో భువనగిరి డీసీపీ కె. నారాయణరెడ్డి, భువనగిరి క్రైం డీసీపీ బి. శ్రీబాల, అడిషనల్ డీసీపీ లక్ష్మి ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఏసీపీ ఎస్. ఉదయ్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు ఎస్. సైదయ్య, దేవేందర్ బృందం కొంత కాలంగా బొడిగె అశోక్ ఇంటి వద్ద నిఘా పెట్టి ఈ నెల 23న అతడిని పట్టుకుని విచారించగా చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడు. అశోక్ ఇచ్చిన సమాచారం మేరకు మిగతా ఐదుగురిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.32.83లక్షల విలువైన 50 తులాల బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండి ఆభరణాలు, 2 బైక్‌లు, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై మోత్కూరు పోలీస్ స్టేషన్‌లో 9, అడ్డగూడూరులో 2, ఆత్మకూరు(ఎం)లో 7, వలిగొండలో 2, రామన్నపేటలో 4, యాదగిరిగుట్టలో 3, రాజపేటలో 3, నకిరేకల్‌లో 3, తొర్రూరులో 1, వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 34 కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ మేరకు నేరస్తులను అరెస్టు చేసి నల్లగొండ జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపినట్లు సీఐ, ఎస్‌ఐ తెలిపారు.

మానసిక వికలాంగురాలిపై అత్యాచారయత్నం

పెద్దఅడిశర్లపల్లి: మానసిక వికలాంగురాలిపై అత్యాచారయత్నం జరిగిన సంఘటన మంగళవారం మండలంలోని అజ్మాపురం గ్రామంలో చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. అజ్మాపురం గ్రామానికి చెందిన ఆడెపు అంజయ్య, గోసంగి ప్రసన్న, వస్కుల రాజేష్ అదే గ్రామానికి చెందిన మానసిక వికలాంగురాలిని బలవంతంగా గ్రామ శివారులో గల నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బలాత్కారం చేసేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో బాధితురాలి సోదరుడు ఆమెను వెతుక్కుటూ వెళ్లగా ఆ ముగ్గురూ పారిపోయారు. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దేవరకొండ డీఎస్పీ నాగేశ్వర్‌రావు, కొండమల్లేపల్లి సీఐ రవీందర్ గుడిపల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఈ ఘటనపై విచారణ చేపడుతున్నారు.

పత్తి దొంగిలించారని ఫిర్యాదు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలంలోని యాపలగూడెం గ్రామానికి చెందిన ముకిరాల శివలింగం, మామిడాల గ్రామానికి చెందిన కొత్తపల్లి రమణయ్య, ఇండ్లూరు గ్రామానికి చెందిన మామిడి జానయ్య, సత్తయ్య తమకు సంబంధించిన 5 క్వింటాళ్ల పత్తి చోరీ అయ్యిందని మంగళవారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పత్తి చోరీకి పాల్పడ్డ వారిని పట్టుకుని తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం


దగ్ధమవుతున్న పత్తిని ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నల్లగొండ రూరల్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో నిల్వ చేసిన పత్తి దగ్ధమైన సంఘటన మండలంలోని దోమలపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు.. దోమలపల్లి గ్రామానికి చెందిన కంభంపాటి లింగయ్య కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం పొలానికి వెళ్లగా మధ్యాహ్నం ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో 50 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. పత్తి కాలుతున్న సమయంలో పొగ, మంటలు రావడాన్ని చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

హత్య కేసులో నలుగురి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ వెంకటయ్య

నకిరేకల్: మండలంలోని తాటికల్ గ్రామంలో వృద్ధుడి హత్య కేసులో పోలీసులు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం నకిరేకల్ సీఐ వెంకటయ్య విలేకరులకు వివరాలు వెల్ల డించారు. తాటికల్ గ్రామానికి చెందిన ఆకిటి వెంకటయ్య (55)కు అదే గ్రామానికి చెందిన తన సొంత బావమరిది వనం సైదులు మధ్య కొంతకాలంగా భూతగదాలు జరుగుతున్నాయి. 2013లో ఇరువురి మధ్య ఘర్షణ జరగగా ఒకరిపై ఒకరు కేసులు పెట్టుకున్నారు. అప్పటి నుంచి వీరు మాట్లాడుకోవడం లేదు. అయితే భూతగదాలను మనస్సులో పెట్టుకున్న వనం సైదులుతో పాటు అతడి కుమారులు నాగరాజు, గోపి కలిసి ఎలాగైనా ఆకిటి వెంకటయ్యను హతమార్చాలని ఈ నెల 20న ఉదయం 5.30 గంటల సమయంలో గ్రామ శివారులోని ముత్యాలమ్మ చెరువు కట్ట వద్ద కాపు కాశారు. చెరువు కట్ట వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వచ్చిన వెంకటయ్యతో వారు గొడవపడ్డారు. ఈ క్రమంలో వెంకటయ్య మెడకు తాడు బిగించి బలవంతంగా తీసుకెళ్లి చెరువులో ముంచి హతమార్చి పరారయ్యారు. మృతుడి కొడుకు సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసున్న పోలీసులు మంగళవారం నకిరేకల్ మండలం చందంపల్లి బస్ స్టేజీ వద్ద వనం సైదులు, అతడి కుమారులు నాగరాజు, గోపితో పాటు వారితో సంబంధం ఉన్న కట్టంగూరు మండలం ఈదూలూరు గ్రామానికి చెందిన నార్ల యాదయ్యను కూడా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించినట్లు సీఐ తెలిపారు. నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న బృందంలో ఏఎస్‌ఐ కృష్ణాచారి, పోలీస్ సిబ్బంది మధుకర్, కొండ రమేష్‌గౌడ్, జనార్దన్ తదితరులు ఉన్నారు.

మోతెకు చేరిన స్వరాజ్య పాదయాత్ర

మోతె: తెలంగాణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ రాజ్య స్థాపనకై దళిత శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ చేపట్టిన పది వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర మంగళవారం ఖమ్మం జిల్లా మీదుగా మోతె మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా డీఎస్పీ రాజ్యాంగ జెండా శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో గత మార్చి 15న ప్రారంభమైన స్వరాజ్య పాదయాత్ర 27 జిల్లాల గుండా 7234 కిలోమీటర్లు పూర్తిచేసుకొని సూర్యాపేట జిల్లాలోకి ప్రవేశించిందన్నారు. జనాభాలో 10శాతం లేని అగ్ర కులస్తులు తెలంగాణను పాలిస్తుంటే, 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజకీయ బానిసలుగా కొనసాగుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభాతో పాటు ఓటర్ల శాతం ఎక్కువగా ఉన్న అణగారిన కులాలకు అధికారం అందించడం కోసం స్వరాజ్య పాదయాత్ర చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాదయాత్ర ఇన్‌చార్జి లక్ష్మణ్, డీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి రాము, నరేష్, శివకుమారన్, మస్తాన్, మండల అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

పట్టు పరిశ్రమపై రైతుల ఆసక్తి

- సెంట్రల్ సిల్క్ బోర్డు రిటైర్డ్ సైంటిస్ట్ ప్రవీణ్‌కుమార్


మాట్లాడుతున్న సెంట్రల్ సిల్క్ బోర్డు రిటైర్డ్ సైంటిస్ట్ ప్రవీణ్‌కుమార్

గరిడేపల్లి: పట్టు పరిశ్రమ ఏర్పాటుపై రైతులు ఆసక్తి చూపుతున్నారని సెంట్రల్ సిల్క్ బోర్డు రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో పట్టు పురుగుల పెంపకంపై మంగళవారం రెండో రోజు జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో పట్టు పరిశ్రమలు ఏర్పాటు చేసే రైతులకు ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ సబ్సిడీలు ఇస్తుందన్నారు. పట్టు పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో తోడ్పాటు అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా కేవీకే పట్టు విభాగం శాస్త్రవేత్త మాధురి చాకి పురుగులు, పెద్ద పురుగుల పెంపకం గురించి వివరించారు. అనంతరం ట్రైనింగ్ కిట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్, కిరణ్, నరేష్, సుగంధి, నరేష్ తదితరులున్నారు.

కలుపును నివారిస్తేనే అధిక దిగుబడి

- వరిలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి
- వ్యవసాయాధికారి రాజగోపాలరావు

పాడి పంట


ఎం. రాజగోపాలరావు, నడిగూడెం వ్యవసాయాధికారి

నడిగూడెం: ప్రస్తుతం మండల పరిధిలోని ఆయకట్టు గ్రామాలతో పాటు, నాన్ ఆయకట్టు గ్రామాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. కూలీల కొరత కారణంగా కలుపు తీయడం ఖర్చుతో కూడుకున్న పనిగా మారుతోంది. ఈ నేపథ్యంలో కలుపు నివారణకు వివిధ రసాయనాలు వినియోగించాల్సి ఉంది. వరిలో కలుపును ఎప్పటికప్పుడు నివారిస్తేనే దిగుబడి అధికంగా ఉంటుందని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు సూచిస్తున్నారు. వరిలో కలుపు నివారణకు చేపట్టాల్సిన యాజమన్య పద్ధతులు ఆయన మాటల్లోనే..

మాగాణి భూముల్లో..

మాగాణి భూముల్లో నాట్లు వేసిన మూడు నుంచి ఐదు రోజుల్లోగా 1 నుంచి 1.5 లీటర్ల బ్యుటాక్లోర్ లేదా 600 మి.లీ. ప్రెటిలాక్లోర్ అరలీటరు నీటిలో కలుపుకోవాలి. ఈ ద్రావణాన్ని 20కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో పలుచగా నీరు ఉంచి సమానంగా వెదజల్లుకోవాలి. గడ్డి, తుంగ, వెడల్పాటి కలుపు మొక్కలు ఉన్నప్పుడు ఎకరానికి 30 నుంచి 50 గ్రాములు ఆక్సాడయార్జిల్ పొడి మందును అరలీటరు నీటిలో కలిపి ఆ ద్రావణాన్ని 20కిలోల పొడి ఇసుకలో కలిపి సమానంగా చల్లుకోవాలి.

ఊదలాంటి గడ్డి జాతి మొక్కలుంటే..

15 నుంచి 20 రోజుల మధ్య పొలంలో ఊదలాంటి గడ్డిజాతి మొక్కలు ఎక్కువగా ఉంటే ఎకరానికి 400 మి.లీ. సైహాలోపాప్ బ్యూటైల్‌ను 200లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. గడ్డిజాతి మొక్కలు, వెడల్పాటి మొక్కలు ఎక్కువగా ఉంటే ఎకరానికి 80 నుంచి 100 మి.లీ. బైస్పైరి బ్యాక్ సోడియంను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 25 రోజుల నుంచి 30 రోజుల మధ్య ఎకరానికి 400 గ్రాముల 2.4–డి సోడియం సాల్ట్ లేదా, 50 గ్రాముల ఇథాక్సీ సల్ఫ్యురాన్‌ను లేదా 15శాతం పొడి మందుతో 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఎలాంటి కలుపు మొక్కలనైనా నివారించవచ్చు.


కోనోవీడర్ ద్వారా వరి పొలంలో కలుపు తీస్తున్న రైతు

మెట్ట పొలాల్లో..

మెట్ట పొలాల్లో వరిని వెదజల్లడం, గొర్రుతో విత్తడం వంటి రెండు పద్ధతుల్లో సాగు చేస్తున్నారు. ఇలా సాగుచేసిన పైరులో కలుపు నివారణకు విత్తిన రెండు లేక మూడు రోజుల్లోగా లీటరు నీటికి ప్రెటిలాక్లోర్ 50శాతం ద్రావణాన్ని లేదా బ్యుటాక్లోర్ కలిపి ఈ ద్రావణాన్ని ఇసుకలో కలిపి పొలంలో చల్లుకోవాలి.

కోనోవీడర్‌తో కలుపు తీయాలి

శ్రీవరి లేదా యంత్రంతో నాటు లేదా డ్రమ్‌సీడర్ ద్వారా వేసిన వరి పొలాల్లో 40 రోజుల్లోపు ప్రతి 10 రోజులకు ఒకసారి కోనోవీడర్ లేదా పవర్ వీడర్‌తో నాలుగుసార్లు కలుపును తీయాలి. తొలగించిన కలుపు మొక్కలు పచ్చిరొట్ట ఎరువుగా తయారవుతాయి. దీంతో పిలకలు, దుబ్బులు అధికంగా వస్తాయి. పంట దిగుబడి కూడా సాధారణ పద్ధతిలో కన్నా ఈ విధానంలో ఎక్కువగా వస్తుంది.